క్లుప్తంగా

శేఖర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ని హిస్టరీ విభాగం పరిశోధకుడు జి.శేఖర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. డిప్లొ మసీ ఆఫ్ ది రాయాస్ ఆఫ్‌ది విజయనగర (1336–1565) అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను శేఖర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు పి.హైమవతి పర్యవేక్షణలో శేఖర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట : కాజీపేట నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో 35 ఏళ్ల వయస్సు పైబడిన వ్యక్తులకు భూమి కొలతలు (ల్యాండ్ సర్వేయర్)పై శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల శిక్షణ ఇవ్వడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వంచే సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు.వివరాలకు 79892–50779 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

శిక్షణ ముగింపు

మామునూరు: మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న జనపనార సంచుల తయారీ శిక్షణ శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పశువైద్యవిశ్వ విద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్‌కుమార్ హాజరై శిక్షణార్థులకు సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ రామ సుబ్రమణియన్, డాక్టర్ అరుణ్‌జ్యోతి, నిర్మల, సాయి కిరణ్, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు

సీపీకి వినతి

ఖిలా వరంగల్ : వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను శనివారం అగ్ని ప్రమాదంలో మూగ జీవాలు కోల్పోయి రోడ్డు మీద పడిన బాధితులు దుగ్గిరాల లక్ష్మణ్, కుమారి దంపతులు కలిశారు. ఈ సందర్భంగా సీపీకి వారు వినతిపత్రం అందజేశారు. మూగజీవాల షెడ్‌కు మంటలు అంటించిన ఆకతాయిలను వెంటనే గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

వికసిత్ భారత్ పోటీల్లో కేయూ విద్యార్థుల ప్రతిభ

కేయూ క్యాంపస్: కేంద్ర యువజన మంత్రిత్వ శాఖ నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ ప్రతిభాపాటవ రాష్ట్రస్థాయి పోటీలకు కేయూ కో–ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ విద్యార్థులు టి.కార్తీక్, ఎన్.శ్రావ్యలు ఎంపికయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని అనురాగ్ డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వికసిత్ భారత ప్రతిభాపాటవ పోటీల్లో వీరు పాల్గొన్నారు. వీరికి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ దాసరి శైలజ, సౌజన్యలు అభినందించారు.

సీపీటీసీలో శ్రమదానం

మడికొండ: వరంగల్ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం మడికొండలోని సిటీ పోలీసు ట్రెనింగ్ సెంటర్‌లో సిబ్బంది శ్రమదానం చేశారు. సెంటర్‌లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ట్రెనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు పేర్కొన్నారు. సీటీసీ ఆర్ఐలు, ఎస్సైలు, ఇండోర్, అవుట్ డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందరాజుల స్వామిని దర్శించుకున్న కేరళ ఐజీపీ



వరంగల్ చౌరస్తా : గోవిందరాజుల గుట్టపై వెలిసిన గోవిందరాజస్వామిని శనివారం కేరళ రాష్ట్ర ఐజీపీ లక్ష్మణ్, మినీ మోల్ కేరళ రాష్ట్రం పాలక మున్సిపాలిటీ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయంలో కాలభైరవ ప్రత్యంగిరా ఛండీయాగం నిర్వహించారు. కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, స్థానికులు సునీల్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మోడల్ యునైటెడ్ నేషన్స్ ప్రోగ్రాం

హసన్‌పర్తి : కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన మోడల్ యునైటెడ్ 7.0 కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్‌గా మర్యమ్ యాస్మిన్, రిత్వికా ప్రియా, డైరెక్టర్ జనరల్‌గా ఎం.డి జోహైబ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సమాజంలో నాయకత్వ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. తెలంగాణతో పాటు వివిధ కళాశాలల నుంచి 260 విద్యార్థులు పాల్గొని ఐక్యరాజ్య సమితిలో జరిగే సన్నివేశాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతి, శ్రీలత, నరసింహారావు, ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

మండల కార్యాలయంలో సర్వర్ డౌన్

- నిలిచిపోయిన సేవలు
- ఆందోళనలో విద్యార్థులు, యువకులు

హసన్‌పర్తి : మండల కార్యాలయంలో సర్వర్ డౌన్ అయింది. మూడు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. అర్ధరాత్రి వరకు సర్వస్ డౌన్ వల్ల సర్టిఫికెట్లు జారీ చేయలేకపోయారు. దీంతో వివిధ సేవలకు దరఖాస్తులు చేసుకున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు మేం ఏం చేసేది లేదని చేతులెత్తారు. ప్రస్తుతం ప్రభుత్వ అమలు చేస్తున్న రాజీవ్‌యువ వికాసం పథకంతో పాటు వివిధ ఎంట్రన్స్‌ల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఇటు రాజీవ్ యువవికాసం పాటు అటు ఎంట్రన్స్‌లకు దరఖాస్తుల కోసం రెవెన్యూ కార్యాలయం నుంచి కులం, ఆదాయం, నివాస ధృవీకరణ పత్రాలు తప్పనిసరి.



సర్టిఫికెట్ల కోసం పడిగాపులు కాస్తున్న యువకులు, విద్యార్థులు

నిలిచిపోయిన సేవలు..

ఆయా సర్టిఫికెట్ల కోసం మీ–సేవా ద్వారా విద్యార్థులు, యువకులు దరఖాస్తులను పొందిపరిచారు. అయితే సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయానికి వెళితే అప్పటికే దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పేరుకపోయాయి. మూడు రోజులుగా సర్వర్‌డౌన్‌తో సేవలు నిలిచిపోయాయి.

ఆందోళన

మూడు రోజులుగా సర్టిఫికెట్లు అందకపోవడంతో ఇటు విద్యార్థులు, అటు యువకులు ఆందోళన చెందుతున్నారు. సర్టిఫికెట్ల కోసం కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఎంట్రన్స్‌లు, యువ వికాసం పథకాల కోసం గడువు సమీపిస్తుండడంతో సర్టిఫికెట్లు రాకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్య ఉందని అధికారులు చెబుతున్నారు.

యూనివర్సిటీలోని సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్

విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీలోని సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని రాంనగర్‌లో సీతారాం ఏచూరి ప్రాంగణం సుందరయ్య భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా 32వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీకి రూ.1000 కోట్లు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖమంత్రిని నియమించాలన్నారు. మహాసభలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు బి కళ్యాణ్, బాధ్యులు బీరెడ్డి జస్వంత్, ఎం పరిమళ, ప్రశాంత్, హేమంత్, సాయికుమార్, మడికొండ మేఘన, ఇస్మాయిల్, అజయ్ పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న కిరణ్

సన్మానం



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డిప్యూటీ రిజిస్ట్రార్ తోట రాజయ్యను శనివారం కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, మాజీ వీసీలు విద్యావతి, గోపాల్‌రెడ్డి పాలకమండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఫైనాన్స్ ఆఫీసర్‌గా ఐదేళ్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తూ కేయూ బడ్జెట్ రూపకల్పనలో కీలక భూమిక పోషిస్తున్నారు. ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ పొందబోతున్నారు. ఈ అకడమిక్ సెనేట్ సమావేశంలో ఆయనను దుశ్శాలువా కప్పి పూలబొకేను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా రాజయ్య అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, పాలక మండలి సభ్యులు సురేష్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు

నయీంనగర్ : హనుమకొండ బాలసముద్రం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని అన్నారు. కార్యక్రమంలో నయీముద్దీన్, ఖుద్దూస్, ఖలీల్, ఖదీర్, సోనీ, గౌస్ ఖాన్, ఇస్మాయిల్, ముర్తుజా, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు రంజిత్‌రావు, సోదా కిరణ్, పులి రజనికాంత్, ఫారూక్, మహమూద్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నేతలు

4న వర్తక సంఘం ఎన్నికలు



మాట్లాడుతున్న ఎన్నికల కమిటీ ప్రతినిధి నాగేశ్వర్‌రావు

వరంగల్ : వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లోని ది వరంగల్ కమీషన్ కూరగాయల వర్తక సంఘం నూతన కమిటీ ఏర్పాటు కోసం ఏప్రిల్ 4న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ బాధ్యులు సోల శ్రీనివాస్, కర్రె నాగేశ్వర్‌రావు ప్రకటించారు. వరంగల్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌లో హాల్‌లో కమీషన్ వ్యాపారుల సంఘం సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో నూతన కమిటీ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కమిటీలోని అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ చేసే వారు ఏప్రిల్ 2న (బుధవారం) ఉదయం 9 నుంచి 12 గంటల లోపు తమ పేర్లను ఎన్నికల కమిటీకి అందజేయాలన్నారు. ఏప్రిల్ 4న (శుక్రవారం) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ఓటింగ్ నిర్వహిస్తామని కమీషన్ లైసెన్సులు ప్రతి వ్యాపారి తన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల కమిటీ బాధ్యులు తెలిపారు. సమావేశంలో 66 మంది కమీషన్ వ్యాపారులు, వర్తక సంఘం నాయకులు బేతి అశోక్‌బాబు, రాజు, యుగంధర్, రవీందర్ రావు, వెలిశెట్టి గాంధీ, శ్రీధర్ పాల్గొన్నారు.

సామాజిక సేవలో విద్యుత్ ఉద్యోగులు

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: ప్రతి ఇంటిలో విద్యుత్ వెలుగులు ప్రసరించినట్లుగానే విద్యుత్ ఉద్యోగులు, అధికారులు సామాజిక సేవలోను ముందు వరుసలో నిలుస్తున్నారని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తూనే మరో వైపు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇంచార్జ్ డైరెక్టర్లు, ఏఈలు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించి తాగునీరు అందిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

'రాజీవ్ యువవికాసం' దరఖాస్తు గడువు పెంచాలి

హన్మకొండ : ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం గడువు తేదీని పొడిగించాలని దళిత బహుజన ఫ్రంట్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్ కోరారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద దరఖాస్తు గడువు పెంచాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు ఈ దిశగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. నాయకులు నవీన్, నర్సింగరావు, ఐలయ్య, మల్లేశం, రమేష్ పాల్గొన్నారు.

ఉగాది కవితలు

నూతన శోభ



ఉగాది ఉత్సాహం
నిండగా,పచ్చడి రుచులు
మెండుగా,
శోభిల్లెను భువి కొత్తగా,
ఆనంద జల్లులు
వీరియేను హృదయంగా !
పంచరుచులతో పచ్చడి ప్రసాదం,
జీవిత గాథలోని నిజమైన సందేశం!
తీపి, చేదు, కారము, పులుపు, వగరు,
సంగమమయ్యె జీవన అంతరంగము!
ముందుకు సాగెదము, సంతోషంగా నిలిచెదము,
ఉగాది శుభాకాంక్షలతో !

– వై .రాజ్ కుమార్, భీమారం, హనుమకొండ

వచ్చింది ఉగాది



అదిగో అదిగో
వచ్చింది వచ్చింది ఉగాది
చీకటి కాంతులు చీల్చుకుని
వేకువ రేకలు నిలుపుకుని
వసంత కోకిల కిలకిలారావాలతో
వచ్చింది వచ్చింది ఉగాది
ప్రకృతి కాంత పులకరించే
పాటలు పాడుతూ
ఆరు రుచుల సమ్మేళనమే జీవితం
ఎన్నో ఆశలు, ఆశయాలతో, కోరికలతో
మనల్ని ముందుకు నడిపింది ఉగాది

– తోట అశోక్, వరంగల్

స్వాగతం..

స్వాగతం విశ్వావసుకు స్వాగతం క్రోధాలను
తొలగించి
ప్రశాంతతను ఆహ్వానించి
పాడి పంటలను రక్షించి
కాలుష్యం నివారించి
జగం అంతా సజ్జనులతో నిండేలా
కలిసి సాగుతాం నీతో మేమంతా
స్వాగతం.. సుస్వాగం
విశ్వావసు నీకు స్వాగతం

– వి.సాత్విక్, ఏడో తరగతి, ఎంజేపీ పాఠశాల, ఖిలావరంగల్

విశ్వాసమే విశ్వావసు ఉగాది

ఉగాది పర్వదినం
ఉత్తేజం అందించే సుదినం
ఇంటిల్లిపాదికి అదో ఆనందం
ఉగాది పచ్చడిలో ఉంది
అమృతం
తెలుసుకోవాలి ఆ రహస్యం
వగరు తీపి – కష్టం సుఖం
చేదు పులుపు – బాధ విచారం
ఉప్పు కారం – కోపం తాపం
మనిషి జీవితంలో జరిగే కాలచక్రం
విశ్వావసు ఉగాది శుభాకాంక్షలు

– నక్క కుమారస్వామి, వంగపహాడ్, హనుమకొండ

ఉగాది



చిగురు తొడిగిన చైత్రమా
నవ వసంతానికి స్వాగతం
పలుకుమా
యుగమునకు అది యుగాది
జీవన గమనానికి వేయి పునాది
లేలేత పవనాల స్పర్శలాపనతో మదిలో
ఆనందరాగం
పరవశించిన కోకిల ఆలపించెను నవరాగం
షడ్రుచుల మధుర సమ్మేళనం ఉగాది పచ్చడి
సేవనం పంచాంగ శ్రవణం
కలిగించు భవిష్య దర్శనం
ఓ విశ్వావసు అష్ట ఐశ్వర్యాలతో
కలిగించు అందరిలో ఉషస్సు

– మామిడాల కిరణ్, వరంగల్

రావమ్మా విశ్వావసు



క్రోధాన్ని చీల్చుకుంటూ..
క్రోధి నామ సంవత్సరం
కోపంగా చూసింది..
ఆ కోపాన్ని వదిలేసి
శాంతంగా నడవమ్మా..
మత్తే తన జీవితమని మనిషి మారిపోయాడు..
చెడు పనులు చేస్తూ చెలరేగిపోతున్నాడు..
మనిషిలో మంచిని పెంచేందుకు
రావమ్మా విశ్వావసు..

– కె.మనోజ్, ఏడో తరగతి, ఎంజేపీ పాఠశాల, ఖిలా వరంగల్

ఉచిత వైద్యశిబిరానికి అపూర్వ స్పందన

ఖిలా వరంగల్: వరంగల్ తిమ్మాపూర్ శివారు సాయి ఓల్డేజ్ హోమ్, ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మెడికవర్ హాస్పటల్ నేతృత్వంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ, న్యాయ సేవాధికార సంస్థ వరంగల్ కార్యదర్శి సాయి కుమార్ హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వృద్ధులు మానసిక, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఎవరైనా తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసినట్లయితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఫిర్యాదు చేసినట్లయితే వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లీగల ఎయిడ్ కౌన్సిల్ పి.శ్రీనివాస్‌రావు, వైద్యాధికారులు డాక్టర్ రమ్య, సాయి ప్రియ, పూర్ణచందర్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

కాజీపేట: గ్రేటర్ పరిధిలోని 61వ డివిజన్ వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై శనివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హో మియోపతి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేర్ సంస్థ ఎండీ.డాక్టర్ ఏఎం రెడ్డి వాకర్స్‌కు పరీక్షలు చేయించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొల్లపల్లి రాజేశ్వర్, అరెల్లి శ్రీనివాస్, సంజీవరెడ్డి, డాక్టర్ నిఖిల్ తేజ, ప్రీతి, శంకర్‌సింగ్ పవన్, పూజ, హరిణి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

12న హనుమాన్ శోభాయాత్ర

మడికొండ: ఏప్రిల్ 12న హనుమాన్ శోభాయాత్ర వరంగల్ రంగశాయిపేట మహంకాళి ఆలయం నుంచి హనుమకొండ పద్మాక్షి దేవాల యం వరకు హనుమద్గిరి వరకు శోభాయాత్ర ఉంటుందని విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ వరంగల్ మహానగర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తెలిపారు. మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం హనుమాన్ శోభాయాత్ర కరపత్రాన్ని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

హన్మకొండ : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత, వరంగల్ మహానగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. 59వ డివిజన్ హనుమకొండ భవాని నగర్‌లో శనివారం పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. కాలనీలోని రోడ్లకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా ఇంటివద్దకు వచ్చే వాహనంలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, జవాన్ భిక్షపతి, భవాని నగర్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ప్రకాష్ రావు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

హన్మకొండ: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని హనుమకొండ హెడ్‌పోస్టాఫీస్ హెడ్ పోస్ట్ మాస్టర్ కె.వి.పవన్ కుమార్ అన్నారు. శనివారం నక్కలగుట్టలోని హెడ్‌పోస్టాఫీస్‌లో లష్కర్‌బజార్ పోస్ట్‌మాస్టర్ పులి సరోత్తంరెడ్డి పదవీ విరమణ, సన్మాన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కె.వి.పవన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పోస్టల్ శాఖలో చేరిన నాటి నుంచి సరోత్తంరెడ్డి అత్యుత్తమ సేవలు అందించారన్నారు. తన శేష జీవితాన్ని సమాజ సేవలకు అంకితం చేయాలన్నారు. ఈ సందర్భంగా పోస్టల్ ఉద్యోగులు, బంధుమిత్రులు శాలువా కప్పి, జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. సమావేశంలో పోస్టల్ అధికారులు వి.హనుమంతు, మదన్ మోహన్, రమాదేవి, అనంత్ రాం నాయక్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

నయీంనగర్ : మిర్యాలకర్ సూరజ్ రాజ్ 24వ వర్ధంతి సందర్భంగా శనివారం మర్కజీ స్కూల్ వద్ద మిర్యాలకర్ సూరజ్ రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు మిర్యాలకర్ దేవేందర్–నిర్మల కుటుంబ సభ్యులు 100 మందికి చీరలు పంపిణీ చేశారు. సురేందర్, అనిత, తదితరులు పాల్గొన్నారు .

సఖి సేవలను సద్వినియోగపరచుకోవాలి

కాజీపేట అర్బన్ : మహిళలు, బాలికలు సఖి సేవలను సద్వినియోం చేసుకోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి తెలిపారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సఖి సేవలపై అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా సఖి సెంటర్ అడ్మిన్ హైమావతి పాల్గొని మాట్లాడారు. సఖి సేవలకు 0870–2452112 లేదా7382983088 నంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు. సఖి సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సొసైటీ ధ్యేయం

ఖిలా వరంగల్ : రైతుల సంక్షేమమే సొసైటీ ధ్యేయమని పీఏసీఎస్ అధ్యక్షుడు కేడల జనార్దన్ అన్నారు. శనివారం వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ఖిలావరంగల్ ఉపాధ్యక్షురాలు సోల్తీ భూమాత అధ్యక్షతన పీఏసీఎస్ వార్షిక సర్వ సభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా జనార్దన్ హాజరై మాట్లాడుతూ రైతులకు రుణాలతో పాటు పంటలకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులను సకాలంలో అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు అభ్యున్నతే లక్ష్యంగా కార్యవర్గం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం సంఘ వార్షిక ఆదాయం, వ్యయాన్ని సభ్యుల ముందు ఉంచగా రైతులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



మడికొండ: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని తరాల పల్లికి చెందిన పుల్యాల సందీప్ ఇంట్లో ఆర్థిక సమస్యలతో ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో నుంచి ఉదయం వెళ్లిపోయాడు. అతని అన్న భూపాల్‌రెడ్డి వెంటనే 100 డయల్ చేసి సమాచారం అందించాడు. దీంతో స్పందించిన కానిస్టేబుల్ రాజు, మడికొండ సీఐ కిషన్‌కు తెలియజేశాడు. వెంటనే సీఐ ఒక టీంను ఫామ్ చేసి ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి ఆచూకీ కనుగొనడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తెలుసుకోగా అతడు జఫర్‌గఢ్‌లో ఉన్నట్లు తెలిసింది. వెంటనే పోలీసు సిబ్బందిని అక్కడికి పంపించి అతడిని తీసుకొని వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెంటనే స్పందించిన సిబ్బందిని సీఐ కిషన్ అభినందించారు.

రంజాన్.. త్యాగానికి ప్రతీక



ఖిలా వరంగల్: రంజాన్ అంటేనే త్యాగానికి ప్రతీక, నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షతో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేయడం రంజాన్ మాసం గొప్పతనమని వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్, ఉర్సు దర్గా పీఠాధిపతి సయ్యద్ ఒబేద్ బాబా అన్నారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఈద్గా మసీద్‌లో తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ కమిటీ ఉమ్మడి జిల్లా చైర్మన్, ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఏసీపీ, పీఠాధిపతి ఒబేద్ బాబాలు సీఐ వెంకటరత్నం, కార్పొరేటర్ పోశాల పద్మతో కలిసి పేదల ముస్లింలకు నిత్యావసర సరుకుల రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, ఎండీ.ఇంతియాజ్ ఖాన్, సయ్యద్ షబ్బీర్ సలీం, ఫహీం అహ్మద్, ఎండి సాధిక్, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో యువత ముందుండాలి

కేయూ క్యాంపస్ : సమాజ అభివృద్ధిలో యువత ముందుండాలని, సామాజిక సేవలో భాగస్వాములు కావడంతో వ్యక్తిత్వవికాసం పెంపొందుతుందని కేయూ కో–ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రమణ అన్నారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వలంటీర్లు ఆ కళాశాల ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ దాసరి శైలజ, మామిడాల సౌజన్య, డాక్టర్ సంఘాల ఎఫ్రిమ్‌రాజు , ఈసీఈ, ఈఈఈ, సీఎస్ఈ విభాగాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.